నీరు నిలిచే.. అవస్థలు వెలిసే

- ఆర్‌యూబీలోకి వరద నీరు.. పట్టించుకోని అధికారులు
- గేటు వద్ద వాహనదారులకు తప్పని వ్యయప్రయాసలు
- సమస్య పరిష్కారంపై చేతులెత్తేసిన నాగిరెడ్డిపల్లి పంచాయతీ



నాగిరెడ్డిపల్లెకు వెళ్లే మార్గంలో రైల్వే గేట్ వేయడంతో ఆగిన వాహనాలు

నందలూరు : ఆర్‌యూబీలోకి నీళ్లు రావడం, రైల్వే గేట్ మూసివేయడం వల్ల నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌యూబీలోని నీటిని తొలగించేందుకు ఇటు రైల్వే అధికారులు అటు పంచాయతీ సిబ్బంది ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకుంటున్నారు. ఈ సమస్యను ఎవరు పరిష్కరిస్తారో తెలియక తలలు పట్టుకోవడం ప్రజలవంతైంది. చాలా కాలం క్రితం దాదాపు ఒక కోటి రూపాయలకు పైగా వెచ్చించి నందలూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన ఆర్‌యూబీ నిర్మాణం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. చినుకుపడితే ఆర్‌యూబీ మొత్తం మునిగిపోయి వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. వర్షపు నీటితో ఆర్‌యుబి మునిగిపోవడంతో ఇరువైపులా పట్టణ వాసులతో పాటు గ్రామాలకు చెందిన ప్రజలు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అయితే రైల్వేగేట్లు ఆ శాఖకు ప్రధాన సమస్యగా మారింది. రైల్వే శాఖ అనేక ప్రాంతాల్లోని రైల్వే గేట్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక రైల్వేగేట్లు తొలగించిన విషయం తెలిసిందే. కాగా నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో రైల్వేగేటు ఏర్పాటు చేశారు. గ్రామానికి ఇరువైపులా పట్టణం విస్తరించి ఉండటంతో పాటు వేల సంఖ్యలో గృహాలు, నివాస ప్రాంతాలు, వివిధ కార్యాలయాలు, పాఠశాలలతో పాటు రోడ్డుకు ఇరువైపులా గ్రామీణ ప్రాంతాలు కూడా అధిక సంఖ్యలో ఉన్నాయి. నిత్యం వాహన రాకపోకలు అధిక సంఖ్యలో సాగుతుంది. ఇలాంటి తరుణంలో రైల్వేగేట్లు తొలగించేందు కోసం రైల్వేశాఖ చాలా కాలం క్రితం రంగం సిద్ధం చేసింది. నందలూరులో రైల్వేగేట్లు ఎత్తివేసి భారీ ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం అది పూర్తికానందున ఒకవైపు ట్రాఫిక్ సమస్య, మరోవైపు రైల్వేగేటు సమస్య, ఇంకోవైపు వర్షపునీటితో మునిగిపోతున్న ఆర్‌యూబీతో జనం ఏళ్ల తరబడి కష్టాలు ఎదుర్కొంటున్నారు. భారీ ఆర్‌యూబీ నిర్మాణం ఎప్పుడు పూర్తి అవుతుందా అని నాగిరెడ్డిపల్లి వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. దీనిపై స్పందించిన పంచాయతీ ఈఓ సురేష్ తమకు ఎలాంటి సంబంధం లేదని గతంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పంచాయతీ సిబ్బందితో నీటిని శుభ్రం చేస్తున్నామని ఇప్పుడు కన్యక చెరువుకు చెయ్యేరు నుంచి తరలిస్తుండటంతో ఆర్‌యూబీలోకి నీరు వస్తోందని ఈ విషయంపై రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.



నీటితో నిండిపోయిన ఆర్‌యూబీ

ఉపాధ్యాయులకు డీఏ, ఐఆర్ ప్రకటించాలి



బుదారపు నరేంద్రనాథ్

పుల్లంపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండవ దసరా కూడా వచ్చేసిందని, ఇంతవరకు ఉపాధ్యాయులకు చేసిన ఆర్థిక మేలు శూన్యమని, ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన ఏ ఒక్క ఆర్థిక బకాయి కూడా ఇంతవరకు ఉద్యోగులకు ఇవ్వకపోవడం అన్యాయమని ఎస్టీయూ అన్నమయ్య జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బుదారపు నరేంద్రనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పుల్లంపేటలో జరిగిన ఎస్టీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమంతో పాటు ఉపాధ్యాయుల సంక్షేమం కూడా ప్రభుత్వంలో భాగమేనన్నారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే సగటు ఉపాధ్యాయుడు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా ప్రభుత్వం నుంచి రావాల్సిన డీఏలను, పీఆర్‌సీ చెల్లింపులను ఆలస్యం చేస్తున్న సందర్భంగా పీఆర్‌సీ కమిటీ నియమించి 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. అలాగే ఈఎల్ బిల్స్, ఏపీజీఎల్ఐ లోన్లు, పెన్షనర్స్‌కు పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగస్తులపై శీతకన్ను తగదని, ఏ ప్రభుత్వానికైనా ఉద్యోగస్తులు గుండెకాయ లాంటి వారని, అశ్రద్ధ చేయడం తగదని, కావున రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు సానుకూలంగా స్పందించి ఉద్యోగుల పక్షపాతిగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా నాయకులు డి.హరినాథ్, గోదిన గంగాధర్, కె.చంద్రశేఖర్, గౌస్, మున్నూరు ప్రసాద్ రెడ్డి, గొబ్బూరు బాల నరసింహులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సర్తాజ్ హుస్సేన్, సిద్దయ్య, ట్రెజరర్ మలవతు శివరాం ప్రసాద్, రాష్ట్ర మహిళా నాయకురాలు గద్దె పద్మావతి, హైమావతి, నాయకులు మునగపాటి శ్రీనివాసులు, పుత్తూరు అశోక్, గలిజెర్ల శ్రీనివాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

‘డైట్’ ఖాళీలను భర్తీ చేయండి

రాయచోటి : రాయచోటి డైట్‌లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డికి డైట్ లెక్చరర్లు కోరారు. సోమవారం మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో డైట్ అధ్యాపకులు మడితాటి నరసింహారెడ్డి, వైసీ రెడ్డప్పరెడ్డిలు కలిసి ఆయనకు వినతిపత్రం అందజేశారు. రాయచోటిలోని డైట్‌లో 29 అధ్యాపక పోస్టులు ఉండగా ప్రస్తుతం 11 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. 18 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. అధ్యాపకుల కొరత వలన ఛాత్రోపాధ్యాయులకు నాణ్యమైన బోధన అందడం లేదన్నారు. వెంటనే అధ్యాపకుల భర్తీకి చర్యలు తీసుకొని ఛాత్రోపాధ్యాయులకు న్యాయం చేయాలని వారు డైరెక్టర్‌కు విన్నవించారు. వారి విన్నతిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డైట్ లెక్చరర్లు

క్లుప్తంగా

వై.కోటలో పారిశుధ్య పనులు



జేసీబీ సహాయంతో చేస్తున్న పారిశుధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..

ఓబులవారిపల్లె : నియోజకవర్గంలో జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండటంపై ‘సాక్షి’దినపత్రికలో సోమవారం ‘జ్వరం కలవరం’ శీర్షకతో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన వైకోట సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య వైకోట ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న చెత్తా చెదారాన్ని జేసీబీ సహాయంతో తొలగించారు. దీంతో వైద్య సిబ్బంది, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

‘దేశాభివృద్ధిలో ఎన్‌ఎస్‌ఎస్’



ర్యాలీ తీస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

నందలూరు : దేశం అభివృద్ధి చెందడానికి ఎన్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు అనేక కార్యక్రమాలు స్వచ్ఛందంగా నిర్వహిస్తారని ప్రిన్సిపల్ శ్రీదేవి పేర్కొన్నారు. సోమవారం నందలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు దళితవాడలో ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నీలవేణి మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తీసుకురావడం డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ను పాటించడం వంటి లక్షణాలు విద్యార్థులకు అలవడి ఉత్తమమ పౌరులుగా రూపుదిద్దుకుంటారని తెలియజేశారు.

నివాళి



రామరాజు మృతదేహం వద్ద ఆకేపాటి నివాళి

నందలూరు : మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన మహేంద్రవర్మ తండ్రి చెంచు రామరాజు అనారోగ్య కారణంగా మరణించారు. విషయం తెలుసుకున్న అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాటూరుకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట గాల సుధాకర్‌రెడ్డి, గుండు మల్లికార్జున రెడ్డి, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, బూసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మోదుగుల చంద్ర, నరసింహారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, విజయుడు, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

సిద్దవటం : పొన్నవోలు కొత్తపల్లి దళితవాడలో నివసిస్తున్న దళిత మహిళలు తమకు పనులు లేవని ఆర్థిక సహాయం అందించాలని కోరడంతో సోమవారం మాజీ సర్పంచ్ కుమారుడు అంకాలు రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దళితవాడలోని చేతి పంపు మరమ్మతులకు గురైందని ఆయన దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీలోని ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు.


ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

సుండుపల్లె : మండల పరిధిలోని ఎరమనేని పాలెం గ్రామంలో సోమవారం ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ సెంటర్, దిశా సంస్థలు కలిసి ఎయిడ్స్‌పై అవగాహనా సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎయిడ్స్ రీసోర్స్ పర్సన్ అల్లావల్లి తెలియజేశారు. సమావేశంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అలాగే ఏ, బీ, సీ సూత్రం గురించి తెలియజేశారు. అలాగే 40 మందితో ర్యాలీ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ లింకు వర్కర్ నాగప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జ్యోత్స్న, నికిత, హరిత, రెడ్డమ్మ, అంజనమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం



రాజంపేట : రాజంపేట ఏరియా ఆస్పత్రిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు పక్షోత్సవాలలో భాగంగా సోమవారం పలువురు రక్తదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయాన్ని రాజంపేట ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.పీవీఎస్‌రావు ఇక్కడి విలేకర్లకు తెలిపారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యకరమైన మహిళలకు బలమైన కుటుంబాల కోసం శిబిరాలను నిర్వహించామన్నారు. ఈ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, ప్రముఖ గైనకాలజిస్టు డా.చట్టేని అనిల్‌కుమార్‌తోపాటు పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న చెరువులను పునరుద్ధరించండి

సుండుపల్లె : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా తెగిపోయిన చెరువులకు మరమ్మతులు చేసి పునరుద్ధరించాలని జనసేన నాయకులు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ను కోరారు. సోమవారం వారు గ్రీవెన్స్ సెల్ భాగంగా రాయచోటిలోని కలెక్టరేట్‌లో జేసీని కలిసి మాట్లాడారు. మండలంలోని రాచంవాండ్లపల్లె ఎగువ భాగంలో బైరాన్‌చెరువు, అయ్యవారిచెరువు మొరవలు తెగిపోవడంతో భారీ నష్టం వాటిల్లిందన్నారు. అలానే చెరుకువాండ్లపల్లె సమీపంలో కాజ్‌వే తెగిపోవడంతో రోడ్లు కొట్టుకుని పోయి సుమారు 60 గ్రామాల ప్రజలకు నాలుగు రోజుల పాటు రవాణా స్తంభించిపోయిందని తెలియజేశారు. కృష్ణారెడ్డిచెరువు నిండిపోవడంతో గుట్టకిందరాచపల్లి నాయనివారిపల్లి ప్రజల వాగులో కల్వర్టు అవసరమని, అలాగే పింఛా ప్రాజెక్టు గేట్ల ఎత్తి దిగువకు నీరు వదిలినప్పుడల్లా మాచిరెడ్డిగారిపల్లి పంచాయతీ రాచపల్లి దిగువన చిన్నబిడికి ప్రాంతంలో లో లెవల్ బ్రిడ్జి ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని ఆ ప్రాంతంలో హైలెవెల్ బ్రిడ్జికి మంజూరు చేయాలని కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని తెలిపారు. తెగిపోయిన చెరువులను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు జరిపి పునరుద్ధరించాలని జేసీకి విజ్ఞప్తి చేశారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

సిద్దవటం : పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా మండల కేంద్రమైన సిద్దవటం బీసీ బాలుర వసతి గృహం ప్రాంగణంలో సోమవారం గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీవాణి మాట్లాడుతూ సెప్టెంబర్ 12 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా గర్భిణులకు సలహాలు చేశారు. అనంతరం ఇద్దరు గర్భిణులకు సీమంతం కార్యక్రమం, ఆరు నెలలు నిండిన బిడ్డకు అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించామన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రిపాలు తాపితే బిడ్డ ఆరోగ్యవంతులుగా ఉంటారని, గర్భవతులు పోషక ఆహారం తీసుకుంటే పూర్తి ఆరోగ్యవంతులుగా అవుతారని తెలియజేశారు. కార్యక్రమంలో పి.కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ రంగ లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిదండ్రులు సమయం కేటాయించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ విజయజ్యోతి

పెనగలూరు : తల్లిదండ్రులు చిన్న వయస్సులో ఉన్న తమ పిల్లలతో ఎక్కువ సమయం గడిపేందుకు ప్రయత్నం చేయాలని సీడీపీఓ నిర్మలా జ్యోతి అన్నారు. సోమవారం బుట్టిరెడ్డిగారిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో చక్రంపేట సెక్టార్‌లోని అంగన్‌వాడీ కార్యకర్తలతో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు కథలు, బొమ్మలు సహాయంతో చిన్నారుల అభ్యాసాన్ని సరదాగా, సులభంగా తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయకుమారి, సురేఖ రాణి, బుట్టిరెడ్డిగారిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త, సిద్ధవరం గంగాధరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో మదనపల్లె జిల్లా ప్రకటించాలి

మదనపల్లె జిల్లా సాధన సమితి డిమాండ్

మదనపల్లె రూరల్ : ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే మదనపల్లె జిల్లా ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటనచేసి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌లు ప్రజలకు ఇచ్చిన హామీ నిలుపుకోవాలని పీటీయం.శివప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం మదనపల్లె జిల్లా సాధనసమితి కన్వీనర్ హోదాలో స్థానిక బాస్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే మదనపల్లె జిల్లా ఏర్పాటుచేస్తామని, స్థానికంగా జరిగిన మినీ మహానాడు, బెంగళూరు బస్టాండ్ ఎన్నికల బహిరంగసభలో చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్రలో నారాలోకేష్ హామీ ఇచ్చారన్నారు.

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మదనపల్లె జిల్లా ఏర్పాటుపై ఇప్పటికే రెండుసార్లు అసెంబ్లీలో ప్రస్తావించారని, అయినప్పటికీ ప్రభుత్వ పెద్దల నుంచి ఎలాంటి స్పష్టత లేదన్నారు. ఈ పరిణామాలు మదనపల్లె ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో మదనపల్లె జిల్లా సాధన సమితి ప్రతినిధులు నీరుగట్టి రమణ, డేగానిరమణ, తెట్టుశ్రీనివాసులు, సొన్నికంటి రెడ్డెప్ప, పెద్దపాలెం రవిశంకర్, తలారికృష్ణ, బురుజురెడ్డిప్రసాద్, గూడుపల్లె గంగులప్ప, సయ్యద్‌బాషా, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పింఛా నదికి జలహారతి



పింఛా నదిలో పూజలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ హబీబ్‌బాషా, వార్డు మెంబర్లు

పీలేరురూరల్ : మండలంలోని బాలంవారిపల్లె వద్ద గార్గయ ప్రాజెక్టు నిండి పింఛానదిలోకి నీరు ప్రవహిస్తుండడంతో సర్పంచ్ హబీబ్‌బాషా ఆధ్వర్యంలో జలహారతి పట్టారు. సోమవారం గార్గేయ ప్రాజెక్టులో ఉన్న పంపింగ్ మోటార్లను పరిశీలించారు. అనంతరం పించా నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గార్గేయ ప్రాజెక్టు నిండిపోవడంతో పీలేరుకు తాగునీటి సమస్య ఉండదని తెలిపారు. మరోవైపు భూగర్భజలాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు విక్టరీ వెంకటరమణారెడ్డి, మల్లికార్జున రెడ్డి, కాలేషా, సచిన్, అబీద్, పరమేష్, షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

మతిమరుపును తగ్గించుకోవచ్చు

మదనపల్లె సిటీ: మతిమరుపు అనేది లైఫ్‌స్టైల్ చెంజెస్ ద్వారా తగ్గించుకోవచ్చునని విశ్రాంత జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పూల వెంకటరమణ అన్నారు. సోమవారం అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు పాఠశాలలో ప్రపంచ అల్జీమర్స్ డే నిర్వహించారు. శారీరకంగా, మానసికంగా, ముఖ్యంగా చెస్, క్యారమ్స్ వంటి ఆటలు ఆడటం వల్ల అల్జీమర్స్ వ్యాధిని నివారించవచ్చునన్నారు. దీనికి కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో ఉండాలని వివరించారు. శరీరానికి ఆహారం ఏ విధంగా అవసరమో, మెదడుకుఆ తగిన విశ్రాంతి,యోగ, మెడిటేషన్ అవసరమని దీని ద్వారా మతిమరుపు తగ్గించుకోచ్చునని తెలిపారు .వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మతిమరుపు వ్యాధిని మొదటిలోనే కనుగొని చికిత్స మొదలు పెడితే కొంత వ్యాధి తీవ్రతను తగ్గించుకోచ్చునని తెలిపారు.

తిథి భోజనం



గాలివీడు : మండల కేంద్రంలో విక్రమాదిత్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిథి భోజనం ఏర్పాటు చెయ్యడం అభినందనీయమని మండల విద్యాధికారి పిల్లి నాగరాజు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో విద్యనందిస్తూ భోజనాలను ఏర్పాటు చెయ్యడం ప్రశంసనీయమన్నారు.

వెలుగు అకౌంటెంట్‌పై విచారణ

ములకలచెరువు : వెలుగు కార్యాలయ అకౌంటెంట్ సాయిలీల నిధులు దుర్వినియోగం చేసినట్లు ములకలచెరువుకు చెందిన సోమశేఖర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై సోమరవారం ఎంపీడీఓ హరినారాయణ, ఏపీఎం మధుబాబు విచారించారు. వివరాలిలా.. ములకలచెరువులో సీత, తులసి, కదిరినాధుని కోటకు చెందిన నందిని మహిళా సంఘాల్లోని ముగ్గురు మహిళల పేరు మీద స్త్రీనిధి ద్వారా నగదు తీసుకున్నట్లు, సంఘాలకు నిధులు మంజూరు చేస్తే డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అలాగే సమావేశాలకు ఖర్చులంటూ బిల్లులు పెట్టకోవడం, స్వీపర్లుగా పనిచేస్తున్న మహిళలకు సైతం జీతం ఇవ్వడం లేదంటూ ఫిర్యాదులు వచ్చాయన్నారు. పూర్తిస్థాయిలో విచారించి నివేదికను ఉన్నతాధికారులు అందజేస్తామన్నారు.

వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోండి



ఈఓపీఆర్‌డీకి వినతిపత్రం అందజేస్తున్న వాలంటీర్లు

నందలూరు : వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఈఓపీఆర్‌డీ సునీల్‌కుమార్‌ను సోమవారం పలువురు వాలంటీర్లు కోరారు. ఈ సందర్భంగా సోమవారం వాలంటీర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకుని వాలంటీర్లకు ఇస్తామన్న గౌరవవేతనం రూ.10 వేలు ఇవ్వాల్సిందిగా కోరారు. అనంతరం ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వాలంటీర్లు సాయికృష్ణ, శివకోటి, సురేంద్ర, సుబ్రమణ్యంరెడ్డి, శ్రీకాంత్, సుధీర్‌కుమార్, మక్బుద్‌బాషా, ఆయూబ్, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాయచోటిలో బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు



రాయచోటిలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

రాయచోటి : రాయచోటిలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన కూడళ్లు, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సామగ్రి, వాహనాల తనిఖీ, బంగ్లా సర్కిల్, ఠాణా సర్కిల్ పరిసర ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్ ప్రత్యేక తనిఖీలు జరిపారు. డాగ్ స్క్వాడ్ సహాయంతో అనుమానాస్పద వస్తువులను పరిశీలించారు. రద్దీ ప్రదేశాల్లో పోలీసులు పహారా నిర్వహించి ప్రజల్లో భద్రతపై నమ్మకం కల్పించారు. ఈ చర్యల వలన నేరాల నివారణతో పాటు ప్రజల్లో అప్రమత్తత పెరుగుతుందన్నారు. ఎవరైనా అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు తెలిపారు.

శరణు.. శరణు.. శక్తి స్వరూపిణీ

దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం నవరాత్రుల మొదటి రోజును పురస్కరించుకుని ఆలయాలను సర్వాంగా సుందరంగా అలంకరించారు. సాయంత్రం విద్యుత్ వెలుగుల్లో ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఆయా ప్రాంతాల్లో వెలసిన ఆలయాల్లో కొలువైన శక్తి స్వరూపిణీలు భక్తుల విశేష పూజలందుకున్నాయి. ఈ సందర్భంగా పూజారులు ఉదయాన్నే అమ్మవార్లను అభిషేకించి, పూజలు జరిపి విశేషంగా అలంకరించారు. సాయంత్రం నవరాత్రి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. రాజంపేట అమ్మవారిశాల ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు దేదీప్యమానంగా మొదలయ్యాయి. ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఇటు ఆలయ కమిటీలు అటు పోలీసులు పటిష్ట బందోబస్తు కల్పించారు.

– సాక్షి, నెట్‌వర్క్



రాజంపేట టౌన్: కంచికామాక్షమ్మ అలంకారంలో మారెమ్మ



లక్కిరెడ్డిపల్లె: బాలా త్రిపుర సుందరీగా సర్వమంగళా దేవి



చిన్నమండెం: శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారంలో శ్రీ కన్యకా పరమేశ్వరీ



చిట్వేలి: బాలా త్రిపురసుందరిగా భద్రకాళి



నందలూరు: దీక్షాబంధన అలంకారంలో కన్యకాంబ



ఒంటిమిట్ట: దీక్షా బంధనాదేవీ అలంకారంలో వాసవాంబ



గాలివీడు: బాలా త్రిపురసుందరీదేవిగా దుర్గమ్మ



సిద్దవటం: దీక్షాబంధనాదేవీగా గంగభవానీ



రాయచోటి జగదాంబ సెంటర్: వాసవాంబదేవి అలంకారంలో కన్యకాంబ



రాజరాజేశ్వరీదేవిగా దర్గా మాతాజీ



రాయచోటి: అలంకారంలో కన్యకాంబ



రాయచోటిలో పార్వతీదేవిగా దాక్షాయణీ దేవీ



పెనగలూరు మండలంలో..